సాక్షి అనకాపల్లి

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పోటెత్తిన అర్జీదారులు

కలెక్టరేట్‌లో 4 వారాల తర్వాత ప్రారంభమైన పీజీఆర్‌ఎస్‌కు వివిధ సమస్యలపై 498 వినతులు అందాయి. 8లో

నేడు శాంతి హోమం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఆలయ కల్యాణమండపంలో హోమాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి సోమవారం పేర్కొన్నారు. ఈనెల 24న 20 మి.మీ, 25న 16, 26న 18, 27న 11, 28న 24 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

అనధికార బాణసంచాపై

ఉక్కుపాదం

- అనుమతి లేకుండా తయారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎస్పీల వీడియో కాన్ఫరెన్స్‌లో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

సాక్షి, విశాఖపట్నం: దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో అనుమతి లేకుండా బాణసంచా తయారీకి పాల్పడితే కఠిన చర్యలుంటాయని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి హెచ్చరించారు.

సోమవారం డీఐజీ కార్యాలయం నుంచి అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమతులు ఉన్న గొడౌన్లు, షాపుల వద్ద భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో చూడాలని, లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో అనధికారికంగా బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు చేపట్టే వారిని ముందుగా గుర్తించి, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు వద్ద బైండోవరు చేయాలని అధికారులను డీఐజీ ఆదేశించారు.

సిఫారసులకే పెద్దపీట

- తహసీల్దార్ల బదిలీలో నిబంధనలకు తూట్లు
- ఎమ్మెల్యేలు సూచించిన వారికే కేటాయింపు
- ఏజెన్సీలో పనిచేస్తున్న వారికి మళ్లీ అన్యాయం



మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో తహసీల్దార్ల బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట వేశారు. స్థానిక ఎమ్మెల్యేల ఆదేశానుసారం పోస్టింగ్‌లు లభించాయి. చాలా కాలంగా నగరంలోనే తిష్ట వేసిన తహసీల్దార్లను కదిపే సాహసం ఉన్నతాధికారులు చేయలేకపోయారు. దీంతో ఏజెన్సీలో పని చేసే వారికి నిరాశే ఎదురైంది. రెండేళ్లగా మన్యంలో పనిచేసిన వారిని, 50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలన్న జీవోకు అధికారులు తూట్లు పొడిచారు. మైదాన ప్రాంతాల్లో పలు కీలకమైన తహసీల్దార్ పోస్టులను కూడా కూటమి నేతలు చెప్పిన వారికే దక్కాయి.

బదిలీల్లో చివరి రోజు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మొత్తం 16 మంది తహసీల్దార్లకు పోస్టింగులు, కేటాయింపులు చేశారు. ఇందులో ఎనిమిది మందిని విశాఖ జిల్లాకు, ఐదుగుర్ని అనకాపల్లి జిల్లాకు, ముగ్గుర్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు పోస్టింగ్‌లు ఇస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్లు, ఉప తహసీల్దార్ల పోస్టులన్నీ స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు నిర్వహించారు. కొందరు అధికారులు స్వయంగా ఎమ్మెల్యేలతో ఉన్నతాధికారులు ఫోన్లు కూడా చేయించారు. దీంతో కూటమి ఎమ్మెల్యేల పంపిన జాబితా ప్రకారం తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లకు బదిలీలు నిర్వహించారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

వీరంటే ఉన్నతాధికారులకూ హడలే..!

గతంలో ఇచ్చిన పోస్టింగ్ జోలికి ఉన్నతాధికారులు వెళ్లలేదు. ఇప్పుడు అన్నీ కొత్త పోస్టింగ్‌లే ఇచ్చారు. గతంలో కేటాయించిన పోస్టింగ్‌లో కొనసాగుతున్న పలువురి తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నా..వారిని బదిలీ చేసేటంత సాహసం ఉన్నతాధికారులు చేయలేకపోయారు. వీరిని కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఒత్తిడే ప్రధాన కారణంగా తెలుస్తోంది. మొత్తం మీద నాలుగు మండలాల్లో పోస్టింగ్‌లపై విమర్శలు వస్తున్నాయి. కొంత మంది ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వో పోస్టుల్లోనే నిబంధనలు పట్టించుకోకుండా స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే కేటాయించారు.

మళ్లీ వారికి నిరాశే..

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖలో పనిచేయడానికి పలువురు తహసీల్దార్లు ఉత్సాహం చూపారు. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి కూడా చాలా మంది దరఖాస్తు చేశారు. మొత్తం మీద ఈ రెండు జిల్లాల నుంచి 15 మంది విశాఖలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. నలుగురు తహసీల్దార్లు ఎంతో కాలం నుంచి ఏఎస్ఆర్ జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారు. వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఈసారి కచ్చితంగా మైదాన ప్రాంతంలో పనిచేసే అవకాశం వస్తుందని ఎంతగానో ఎదురుచూశారు. ప్రభుత్వ జీవోను కాదని నేతల సిఫారసు లేఖలకే ఉన్నతాధికారులు పెద్దపీట వేశారు.

రెవెన్యూ కేడర్లలో బదిలీలు

రెవెన్యూశాఖలో పలు కేడర్లలో బదిలీలు నిర్వహించారు. మొత్తం 40 మంది డిప్యూటీ తహసీల్దార్ల (డీటీ)ను బదిలీ చేశారు. ఆరుగురు డీటీలను అల్లూరి సీతారామరాజు జిల్లాకు, ఆరుగుర్ని అనకాపల్లి జిల్లాకు కేటాయిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విశాఖ జిల్లాలో 28 మంది డీటీలను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితోపాటు 14 మంది జూనియర్ అసిస్టెంటు/టైపిస్టులను, 55 మంది సీనియర్ అసిస్టెంట్లను, 28 మంది వీఆర్‌వోలు గ్రేడ్-2లకు కూడా బదిలీ చేశారు.

జ్వరాలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రచార ఆర్భాటమా?

- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి హాజరు కాలేము
- జ్వరపీడితులకు వైద్యసేవలందించడం ముఖ్యం
- ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వండి
- డీఎంహెచ్‌వోకు సచివాలయ హెల్త్ సెక్రటరీల వినతి



డీఎంహెచ్‌వో బాలాజీకి వినతిపత్రం అందజేసిన సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ప్రతినిధులు

సాక్షి, అనకాపల్లి: వంద రోజుల పాలనలో చేసింది శూన్యమైనా ప్రచార ఆర్భాటం ఎక్కువగా ఉన్న కూటమి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ప్రభుత్వ సిబ్బందిని రోడ్డు ఎక్కించడంపై నిరసన వ్యక్తమైంది. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించడం, కరపత్రాలు పంపిణీ చేయించడం వంటి పనులు చేయిస్తున్న వైనంపై ప్రజల నుంచి సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సీజనల్ వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్న స్థితిలో బాధ్యత మరచి తాము ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొనలేమని సచివాలయ హెల్త్ సెక్రెటరీలు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనలేమని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ప్రజలకు సకాలంలో వైద్యసేవల అందించలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో గ్రామాల్లో తమ వైద్యసేవలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల నుంచి తమకు మినహాయింపు ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వోకు యునైటెడ్ విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల దేవకి ఆధ్వర్యంలో యూనియన్ సెక్రటరీలు శివకుమారి, పద్మ, ట్రెజరర్ దేవుడమ్మ, టి.విజయ. రేవతి, రమాదేవి, లక్ష్మిలతోపాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. వ్యాక్సినేషన్, ఇతర రోజువారీ పనుల నిర్వహణ, యాప్స్ ద్వారా పై అధికారులకు డాటా చేరవేయటం, ఎమర్జెన్సీ కేసులు, సర్వేలు వంటి పనులతోనే ఊపిరి సలపని పరిస్థితి ఉందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల దేవకి పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పోర్టులో స్వచ్ఛతా హీ సేవ



మొక్కలు నాటుతున్న పోర్టు చైర్మన్

విశాఖ సిటీ: స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పరిపాలన భవనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం. అంగముత్తు, డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, ఇతర విభాగాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా పోర్టు పరిపాలన భవనం దక్షిణ భాగంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. వెయ్యి మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించగా, సోమవారం 300 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏవీఎన్ కాలేజ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

'వంద రోజుల పాలనలో ఆకాశాన్నంటిన ధరలు'

అనకాపల్లి: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని, ధరలను నియంత్రించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకోట చెన్నమూర్తి అన్నారు. స్థానిక ఉడ్‌పేట సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, సామాన్యుడు కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారిందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలన్నారు. సంఘం పట్టణ యువజన విభాగం ఉపాధ్యక్షుడు చిందాన కృష్ణ, సంఘం సభ్యులు ఉమా శంకర్ ప్రసాద్, పాలతీర్థపు రాజు, ద్వారపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సెక్రటరీగా వెంకటరమణ

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీలో పలువుర్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ సెక్రటరీగా బి.వెంకటరమణని నియమిస్తూ స్పెషల్ సీఎస్ అనిల్‌కుమార్ సింఘాల్ జీవో జారీ చేశారు. అదే విధంగా యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పీఎం సత్యవేణిని నియమించారు. జీవీఎంసీ డీపీవోగా కనకమహాలక్ష్మిని నియమించారు.

మేయర్, డిప్యూటీ మేయర్లకు ఢిల్లీ సదస్సుకు ఆహ్వానం

అల్లిపురం: నగరాల ఆర్థిక ప్రగతి, ప్రజల జీవన విధానంపై ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్-2024 సదస్సుకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లకు ఆహ్వానం అందింది. నగరాల్లో జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, వాటిని మరింత స్థిరంగా మార్చడానికి, నగరాల పాలన, పనిని మెరుగుపరచడం వంటి అంశాలపై ఈనెల 26వ తేదీన ఢిల్లీలో ఈ సదస్సు జరుగుతుందని డిప్యూటీ మేయర్ శ్రీధర్ తెలిపారు.

తహసీల్దార్ల బదిలీ

తుమ్మపాల: జిల్లాలో తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 26 మండలాల తహసీల్దార్లతోపాటు కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లకు కూడా స్థానచలనం కలిగింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ
కె.విజయకుమార్	ఎస్.రాయవరం	అనకాపల్లి
లె.శ్రీనివాసరావు	విశాఖపట్నం	కశింకోట
ఎ.రామారావు	(రాష్ట్ర సచివాలయం)	చోడవరం
ఎం.లక్ష్మి	దేవరాపల్లి	బుచ్చెయ్యపేట
సిహెచ్.నాగమ్మ	ఏఎస్ఆర్ జిల్లా	రోలుగుంట
బి.వెంకటరమణ	శ్రీకాకుళం జిల్లా	రావికమతం
కె.రమాదేవి	విశాఖపట్నం	వి.మాడుగుల
పి.భాగ్యవతి	రాంబిల్లి	కె.కోటపాడు
వై.ఎస్.వివి.ప్రసాద్	ఓఎస్‌డీ రీసర్వే	చీడికాడ
పి.లక్ష్మీదేవి	సూపరింటెండెంట్- కలెక్టరేట్	దేవరాపల్లి
ఎస్.వరహాలు	రోలుగుంట	యలమంచిలి
జి.వి.జనార్దన్	పార్వతీపురం మన్యం	అచ్యుతాపురం
ఎ.శ్రీనివాసరావు	సూపరింటెండెంట్ (ఏవో)- కలెక్టరేట్	రాంబిల్లి
ఎస్.ఎ.మహేశ్వరరావు	రావికమతం	మునగపాక
ఎస్వీ అంబేద్కర్	నక్కపల్లి	పరవాడ
బి.రవికుమార్	నర్సీపట్నం	సబ్బవరం
ఎల్.రామారావు	విశాఖపట్నం	నర్సీపట్నం
పి.శ్రీనివాసరావు	బుచ్చెయ్యపేట	గొలుగొండ
ఎ.వేణుగోపాల్	ఏఎస్ఆర్ జిల్లా	నాతవరం
ఆర్.నరసింహమూర్తి	సూపరింటెండెంట్-కలెక్టరేట్	నక్కపల్లి
జి.సత్యనారాయణ	కశింకోట	పాయకరావుపేట
జె.రమేష్‌బాబు	కె.కోటపాడు	ఎస్.రాయవరం
ఎల్.తిరుమలబాబు	చోడవరం	కోటవురట్ల
బి.వి.రాణి	చీడికాడ	సూపరింటెండెంట్ (ఏవో)-కలెక్టరేట్
ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు	నాతవరం	సూపరింటెండెంట్ - కలెక్టరేట్
పి.వి.రత్నం	వి.మాడుగుల	సూపరింటెండెంట్ (ల్యాండ్స్)-కలెక్టరేట్

ఏపీఐఐసీ గ్రీవెన్స్‌కు భారీగా వినతులు



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం



సమస్యలు చెప్పుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు

- కిటకిటలాడిన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం
- తొమ్మిది గ్రామాల నుంచి మొత్తం 532 అర్జీలు

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు విశేష స్పందన లభించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఏపీఐఐసీ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఐఐసీ వారు తాము సేకరించిన భూముల్లో మౌలిక సదుపాయలు కల్పించే పనులు ప్రారంభించగా.. తమ సమస్యలు పరిష్కరించకుండా, పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించడానికి వీల్లేదని రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చందనాడ, మూలపర, వేంపాడు, పాటిమీద, బుచ్చిరాజుపేట, తదితర డీఎల్ పురం, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, నిర్వాసితులు హాజరై తమ సమస్యలకు సంబంధించి 532 వినతిపత్రాలు అందజేశారు. డీ ఫారం భూములు సాగు చేసుకుంటున్నవారు, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నవారు తమకు పరిహారం అందలేదని ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, కుటుంబాల్లో మేజర్లయిన వారికి పునరావాసం, ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.24 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చందనాడలో గుల్ల కార్మికుల బట్టీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసుకున్న వీటికి కూడా నష్టపరిహారం చెల్లించాలని దళితులు కోరారు.

కొత్త ఇళ్లకు కూడా పరిహారం ఇవ్వాలి

మూలపర గ్రామంలో 2010కు ముందు నిర్మించిన ఇళ్లకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తున్నారని, తర్వాత నిర్మించిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించడం లేదని ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు ఆధ్వర్యంలో పలువురు బాధితులు ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసిన అధికారులు 2010లో గూగుల్ మ్యాప్‌లో నమోదు చేసిన నిర్మాణాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2010-2024 మధ్యకాలంలో పాత ఇళ్లు తొలగించి కొత్తవి నిర్మించడం, ఉమ్మడి కుటుంబాలు వేరుగా ఏర్పడి ఇళ్లు నిర్మించుకోవడం, పెళ్లయిన మగవారు కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఈ విషయాలపై ఆర్డీవో జయరాం మాట్లాడుతూ కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని, త్వరలోనే గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. సర్వే కూడా చేస్తామన్నారు. ఈ రెండు ప్రక్రియలకు గ్రామస్తులు, రైతులు సహకరించాలన్నారు.

సఫాయి మిత్రులకు సన్మానం



సఫాయి మిత్రులను శాలువాతో సత్కరించిన డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని డీసీహెచ్‌ఎస్ ఎస్.శ్రీనివాసరావు కొనియాడారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణ డీఈఐసీ భవనంలో స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా ఆరు నియోజకవర్గాల నుంచి 108 మంది సఫాయి మిత్రులకు సోమవారం వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉండడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఆమన పేర్కొన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యులు ఎస్.లక్ష్మణ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వచ్చే నెల 15 నాటికి 'స్వర్ణాంధ్ర' ప్రణాళిక



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

- పారిశ్రామిక, పర్యాటక రంగాలు కీలకం
- వ్యవసాయ అనుబంధ విభాగాలకు పెద్దపీట
- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన

తుమ్మపాల: స్వర్ణాంధ్ర-2047 కోసం లక్ష్యాలతో కూడిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, స్వర్ణాంధ్ర లక్ష్యసాధన గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ జిల్లా ప్లాన్ వచ్చే నెల 15 నాటికి రూపొందించాలన్నారు. ఈనెల 30లోగా మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలన్నారు. ఇదే క్రమంలో స్వర్ణాంధ్ర కోసం రానున్న ఐదేళ్లకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి ఏడాది లక్ష్యం ఏమిటో వార్షిక ప్రణాళికలో పొందుపరుస్తూ డాక్యుమెంట్ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక వాడను కీలకంగా తీసుకొని పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు వంటి అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. కళాశాలల్లో, పాఠశాలల్లో 'విజన్ ఆంధ్ర -2047' పేరిట పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా విజన్ ప్రణాళికలో నైపుణ్యాభివృద్ధి, రూరల్ డెవలప్‌మెంట్, ప్లానింగ్, అగ్రికల్చర్, సర్వీస్ సెక్టార్ వంటి రంగాలలో అనుభవం ఉన్న వారిని భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు తమ స్మార్ట్ ఫోన్ నుంచి http:// swarnandhra.ap.gov.in/ Suggestions లింక్‌తో వచ్చే బార్ కోడ్ ద్వారా ఓపెన్ చేసి తమ అభిప్రాయాలను తెలపాలని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

అధికారుల పొలం బాట

- వారంలో రెండు రోజులు గ్రామాలకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు
- పంటలో మెలకువలు, సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సాగు పద్ధతులపై అవగాహన
- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

సాక్షి, అనకాపల్లి: గత ప్రభుత్వం అమలు చేసిన 'పొలం బడి' కార్యక్రమం వ్యవసాయదారులకు మార్గదర్శిగా నిలిచింది. సలహాలు, సూచనలు ఇస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం దిశగా ముందుకు సాగింది. అదే తరహాలో ప్రస్తుత ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. దీనిలో భాగంగా వ్యవసాయాధికారులు ఈ నెల 24 నుంచి పొలం బాట పట్టనున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, సేంద్రియ, మార్కెటింగ్ అధికారులను సమన్వయం చేసుకొని రైతుల కష్టాలు తెలుసుకుని, సాయంగా నిలుస్తారు. ఈ కార్యక్రమం ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు కొనసాగనుంది. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున మొత్తం నాలుగు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఇందులో వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు. అక్కడ రైతుల పరిస్థితులను, పంటల సమస్యలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతారు. పంట మీద ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకుంటారు. వ్యవసాయ రంగానికి అనుసంధానంగా ఉన్న 14 శాఖల సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.


కార్యక్రమం ఇలా..

- ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సాగు పద్ధతులు, కోత పద్ధతులు వివరిస్తారు.
- సాగు వ్యయాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచాలన్నదే కార్యక్రమం ఉద్దేశం
- పంట దిగుబడి తగ్గటానికి కారణాలను విశ్లేషించడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, భూసారం పెంచేలా చర్యలు చేపడతారు. భూసార కార్డుల పంపిణీ, బిందు సేద్యం గురించి వివరిస్తారు.
- కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరు, సంఘాల ఏర్పాటు ద్వారా రుణాల మంజూరు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడంపై అవగాహన కల్పిస్తారు.



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు (ఫైల్)

క్షేత్ర స్థాయిలో రైతులకు పంటలపై అవగాహన



పొలం పిలుస్తోంది.. కార్యక్రమం రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు తోడ్పడుతోంది. ఎటువంటి తెగుళ్లకు ఎటువంటి రసాయనాలు వాడాలి.. ఎంత మోతాదులో వాడాలో రైతులకు తెలియక కూడా పంటకు నష్టం వాటిల్లుతుంది. వారికి ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సూచనలు అందిస్తారు.

– డాక్టర్ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

డిగ్రీ కాలేజీ మంజూరు కోరుతూ కలెక్టర్‌కు వినతి

దేవరాపల్లి : దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ, ఇంటర్ బాలికల వసతి గృహాన్ని మంజూరు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ, ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(స్పందన)లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ, బాలికల వసతి గృహం లేక దూర ప్రాంతాలకు వెళ్లలేక పలువురు విద్యార్థులు పదో తరగతితోనే అర్థంతరంగా చదువులు నిలిపి వేస్తున్నారన్నారని కలెక్టర్‌కు వివరించారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీతో పాటు బాలికల వసతి గృహం ఏర్పాటు చేయడం ద్వారా దేవరాపల్లికి ఆనుకొని ఉన్న సుమారు 200 గిరిజన గ్రామాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా హఠాన్మరణం

అగనంపూడి: గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.వి.ఎస్.ఎం.రాజా (57) సోమవారం సాయంత్రం గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా, గాజువాక మున్సిపల్ వైస్ చైర్మన్, చైర్మన్‌గా పనిచేశారు. గాజువాక మున్సిపాలిటీ, జీవీఎంసీలో విలీనం కావడంతో రాజా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీలో చేరి, అప్పట్నుంచి కొనసాగుతున్నారు. రాజాకు ఇటీవల ఆరోగ్యం క్షీణించడం, సోమవారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని ఏ ప్లస్ హాస్పటల్‌కు తరలించారు. అప్పటికే రాజా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

- 4 వారాల తర్వాత ప్రారంభమైన పీజీఆర్ఎస్
- వివిధ సమస్యలపై 498 వినతులు

తుమ్మపాల: భారీగా కురిసిన వర్షాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో నాలుగు వారాలుగా నిలిచిపోయిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం (పీజీ ఆర్ఎస్) సోమవారం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు అధిక సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో వినతుల నమోదుకు 15 శిబిరాలను ఏర్పాటుచేసి అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ప్రజల సమస్యలను తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. మొదటి అంతస్తులో ఉన్న పీజీఆర్ఎస్ వేదిక వద్దకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగులను కిందనే ప్రత్యేక శిబిరంలో ఉంచడంతో వారి వద్దకే జిల్లా అధికారులు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.

అర్జీలు పునరావృతం కారాదు..

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ 'పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్' లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకుని, సరైన పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరు కాని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వినతుల వెల్లువ

పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 498 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు (సీసీఎల్ఏ) చెందినవి 230 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 24, సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 26, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 43, ఇతర విభాగాలకు సంబంధించి 78 వినతులు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, పాల్గొన్నారు. రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించి నిరసన, ఆందోళనలను కట్టడి చేశారు.





పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి, అర్జీలతో కలెక్టరేట్‌లో క్యూలైన్‌లో బారులు తీరిన అర్జీదారులు

మానసిక దివ్యాంగులకూ రూ.15వేలు పింఛను ఇవ్వాలి..

ఎన్టీఆర్ భరోసా కింద ఇచ్చే మెడికల్ పింఛన్లు రూ.15 వేలు మానసిక దివ్యాంగులకు కూడా వర్తింపజేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ అన్నారు. పీజీఆర్ఎస్‌లో ఐసీడీఎస్ ఇంచార్జ్ పీడీ ఎల్.సుజాతకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇస్తున్న సామాజిక భద్రత పెన్షన్లలో నిస్సహాయులైన కొన్ని రకాల వ్యాధిగ్రస్తులకు మాత్రమే మెడికల్ పెన్షన్లు రూ.15 వేలు ఇస్తుందని, బధిరులకు, అంధులకు, మానసిక దివ్యాంగులకు మినహాయించడం సరైన నిర్ణయం కాదని అన్నారు. సంఘ సభ్యులు యలమర్తి రవి బానోద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న వీరు యాదవ్, దివ్యాంగులు

చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో సర్వే నంబర్ 385లో 2.85 ఎకరాల చెరువుకు సర్వే చేపట్టి నీటి నిర్వహణకు చర్యలు తీసుకోవడంలో మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని, తక్షణమే సర్వేకు ఆదేశించాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యదర్శి పీతా నానాజీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వ్యవసాయానికి జీవనాధారమైన చెరువు ఆక్రమణకు గురవుతుందని, సరిహద్దుల స్పష్టత కోసం సర్వే చేపట్టి నీటి నిర్వహణకు సహకరించాలని కోరారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి..

క్రైస్తవులు, క్రైస్తవ సమాజంపై దాడులకు పాల్పడితే సహించేది లేదంటూ క్రైస్తవ సంఘాల నాయకులు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. ఇటీవల యలమంచిలిలో క్రైస్తవులపై జరిగిన దాడులను ఖండిస్తున్నామని, జిల్లా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీలకు సోమవారం వినతి పత్రాలను అందించారు. క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వీకే జేమ్స్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ కేబికే పీటర్ మాట్లాడుతూ ప్రపంచానికి శాంతిని పంచే క్రైస్తవ సమాజంపై మతోన్మాదులు దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చూసి చూడనట్టుగా వ్యవహరించడం, పోలీసులు ఒక వర్గానికే కొమ్ము కాయడం దారుణమన్నారు. యలమంచిలిలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు పండ్రాన తిమోతి, బి.యోహాను, క్రాంతిపాల్, కిరణ్ కుమార్, కె.పి.డి.ఆర్ ప్రసాద్, జాన్సన్,బెనర్జీ, ప్రమోద్ కుమార్, ఎం.సాల్మన్ రాజు, సిహెచ్.రాజు, ఎం.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేసిన నానాజీ



ఆందోళన చేస్తున్న క్రైస్తవ సంఘాలు

ఇల్లు కూలిన బాధితులను ఆదుకోవాలి

ఇటీవల భారీ వర్షాలతో నివాసముంటున్న ఇంటి పైకప్పు కూలిపోవడంతో ప్రమాదం నుంచి బయటపడి ప్రాణాలు కాపాడుకున్నామని, తమకు నష్ట పరిహారం మంజూరు చేయాలని దేవరాపల్లి మండలం బోయిలకింతాడ గ్రామానికి చెందిన విడుదల అశోక్, సత్యారావు కలెక్టర్‌కు అర్జీ అందించారు. వ్యవసాయ కూలీలైన తాము ఉమ్మడి కుటుంబంతో పెంకుల ఇళ్లలో నివసిస్తున్నామని, ఇంటి పైకప్పు కూలిపోవడంతో నీడలేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇటీవల ఆర్లి గ్రామంలో కలెక్టర్ పర్యాటనలో తెలియజేశామన్నారు. నష్టపరిహారంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

ఎస్పీ కార్యాలయంలో 68 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 68 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్పీ ఎం.దీపిక అన్నారు. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్నట్టు ఆమె చెప్పారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ తదితర వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED TEACHERS
HINDI Pandits
for High School
Salary : 30,000 & above
Cont : 7382779555
Sri Sathya Sai Vidhya Vihar
Anakapalli - 531001, Kakinada Dist.

పాడి రైతుల వద్దకే వెళ్లి సేవలందించాలి

- గాలికుంటు, చిన్నపారుడు, బ్రూసేల్లా, ముద్ద చర్మ వ్యాధికి టీకాలు
- సమీక్షలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ రామ్మోహనరావు

సాక్షి, అనకాపల్లి : పాడి రైతులకు మేలైన సేవలందించడమే పశుసంవర్ధశాఖ కర్తవ్యమని, వారి వద్దకే వెళ్లి మనం సేవలందించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బి.రామ్మోహనరావు అన్నారు. సోమవారం అనకాపల్లి పట్టణంలో గల జిల్లా పశువర్ధక శాఖ కార్యాలయంలో డివిజన్ సమీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు, పశు వైద్యాధికారులు, పారా సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులతో పాటు గోపాల మిత్రలు హాజరయ్యారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా పాడి పశువులకు ముందస్తుగా వ్యాధులు సోకకుండా వేసే టీకాలు, పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ అందించే సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలో పాడి పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి, చిన్నపారుడు రోగం, బ్రూసేల్లా వ్యాధి, ముద్ద చర్మ వ్యాధులకు నివారణ టీకాలు వేసే కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, బ్యాంకుల ద్వారా ఎన్ఎల్ఎం, పీఎంఈజీపీ వంటి రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ పాడి సంపదను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న లింగ నిర్ధారిత వీర్యం, జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఉపసంచాలకుడు డాక్టర్ సిహెచ్.నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ చిట్టినాయుడు, డాక్టర్ పుష్ప డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేష్, పశువైద్యాధికారులు, పారా సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



సమీక్షలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బి.రామ్మోహనరావు. చిత్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ప్రసాదరావు

వయో వృద్ధుల సంక్షేమానికి కృషి

తుమ్మపాల : జిల్లాలో వయో వృద్ధుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం వయో వృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమం, మెయింటినెన్స్ కమిటీ సమావేశం జరిగింది. సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యుల నుంచి పలు సమస్యలను ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీలో రాయితీలు, హాస్పిటల్స్‌లో ప్రత్యేక రాయితీలు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, బ్యాంకులలో లభించే సౌకర్యాలు, ఇతర సంక్షేమాలపై కమిటీలో చర్చించామన్నారు. వయో వృద్ధులకు అందించే సేవలను జిల్లాలో అన్ని శాఖలు అమలు చేయాలన్నారు. ఈ కమిటీ సమావేశంలో పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, అనకాపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్, లీడ్ బ్యాంకు మేనేజర్, డిస్ట్రిక్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారులతో పాటు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్లు కె.వి.గౌరీపతి, కాండ్రేగుల అప్పారావు, ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీసీసీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మాడుగుల/మాడుగుల రూరల్ : గిరిజన కార్పొరేషన్(జీసీసీ)లో ఖాళీగా వున్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల సీపీఎం కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. 1991 నుంచి కొత్తగా నియామకాలు జరపలేదని, అప్పటి నుంచి ఉద్యోగుల ఉద్యోగ విరమణలు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణల వల్ల పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయని, నియామకాలు జరగపోవడం వల్ల గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుతం 226 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారని, 882 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పాతాళగరిడి, నరమామిడి చెక్క, వలిసెలు తదితర వాటిని కొనుగోలును జీసీసీ నిలుపుదల చేసిందన్నారు. చీపుళ్లు, శీకాయ, కుంకుడుకాయ, విప్పపువ్వు, తేనె, నల్లజీడిపిక్కలు, ఇండుగ పిక్కలు, రాజ్మ వంటి అటవీ ఉత్పత్తులు సేల్స్‌మన్ లేక కొనుగోళ్లు తగ్గిపోతున్నాయని, దీనివల్ల గిరిజనుల జీవనోపాధి దెబ్బతింటున్నదని అన్నారు. ఒక ఉద్యోగి రెండు నుంచి మూడు జీసీసీ డిపోలు నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని డిపోలు మూతపడ్డాయని అన్నారు. కొన్ని చోట్ల డిపోలను కాంట్రాక్టు ఉద్యోగులతో నడుపుతున్నారని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించలేదని తెలిపారు. విశాఖలో గల జీసీసీ ప్రధాన కార్యాలయం పరిధిలో పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాలో 156 డిపోలను పర్యవేక్షిస్తుందన్నారు. ప్రతి ఏటా రూ.2500 కోట్ల వ్యాపారం చేస్తుందని, అటువంటి జీసీసీని నిర్వీర్యం చేయడం తగదని, ఖాళీగా ఉన్న 882 పోస్టులను గిరిజన యువకులతో భర్తీ చేయాలని నర్సింహమూర్తి డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ AU డిస్టెన్స్ ఎడ్యుకేషన్ BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA & AP ఓపెన్ స్కూల్ ద్వారా డైరెక్ట్ 10th & Inter One Sitting. అడ్మిషన్లు జరుగుచున్నవి. పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 85006 23868, 90590 86040 [V- 2692]

Real Estate
PLOT FOR SALE
■ విశాఖ వార్డు పరిధిలో 133 గజాలు 6 లక్షలకే, 30 ప్లాట్స్ కలవు. దగ్గరలో అన్ని సౌకర్యాలు అందుబాటులో, స్పాట్ రిజిస్ట్రేషన్ EMI కలదు. డైరెక్ట్ పార్టీస్. ఫోన్ : 70936 32399 [V- 786937]

Services
ASTROLOGY
■ సాయిరామ్ జ్యోతిష్యం : ఫోటో, తాళపత్రం, జన్మపత్రిక చూసి ఉద్యోగం, వివాహం, సంతానం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, దాంపత్య సమస్యలు ఎటువంటివి ఉన్న పరిష్కారం. ఎస్.గణేష్, సెల్ : 89774 98303 [V- 12163]
■ శ్రీ సాయిదుర్గ జ్యోతిష్యాలయం, 9 సం॥లుగా స్థిరంగా ఉన్నారు. స్త్రీ/పు॥ ప్రేమ పెళ్ళి, వ్యాపారం, గ్రహదోష, వశీకరణ, ఎటువంటి సమస్యలకైనా 21 రోజులలో పరిష్కారం. SR హాల్ ప్రక్కన, కొత్త గాజువాక సంప్ర॥ 7702201190. [W-1239999]

BUSINESS OFFER
■ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/-ఇస్తాము. Contact Numbers: 9948000371, 9948000373 [H-1241126]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [V- 823862]

Wanted
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185399]
■ Job in MNC Company : Qlf : 10th, Mobile Operating Part time or full time of Jobs. Employees, Unemployees, Housewife, Rtd. Persons. Call : 89788 61754, 93989 79920 [V- 12638]
■ ఆప్తా హోమ్‌కేర్ హైదరాబాద్ కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 16-20 వేలు, సంవత్సరం లోపు 22-25 కి పెరిగే అవకాశం 20-45 లోపు M/F ఉచిత భోజనం వసతి. 76809 22316 [G-2459]
■ ప్రముఖ వ్యాపార సంస్థకు మేనేజర్స్ తక్షణమే కావలెను. రిటైర్డ్ ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగస్థులు & గృహిణులకు ప్రాధాన్యత. తగిన అభ్యర్థులకు జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 94417 90382 [B-4375]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

రాష్ట్ర స్థాయి రిసోర్సు పర్సన్‌గా దొర మాస్టారు

పాయకరావుపేట : రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా సిహెచ్.ఎస్.దొర ఎంపికయ్యారు. సీఐఈటీ - ఎన్సీఈఆర్టీ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ- కంటెంట్ అభివృద్ధి కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్‌ల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 23 నుంచి 27 వ తేదీ వరకు ఆన్‌లైన్ శిక్షణకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మంది ఎస్ఆర్‌జిల్లో మండలంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకటనగరం ఉపాధ్యాయుడు సిహెచ్.ఎస్ దొర ఎంపికైనట్టు మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీ తెలిపారు. ఇంతకు ముందు ఆయన ప్రస్తుత (ఒకటో తరగతి నుండి 5వ తరగతి) ప్రాథమిక స్థాయికి సంబంధించిన ఆంగ్ల పాఠ్య పుస్తక రచయితగా కూడా పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా ప్రస్తుత దీక్ష కో ఆర్డినేటర్‌గా కూడా సేవలందిస్తున్నారు. ఈ-కంటెంట్‌లో భాగంగా నాలుగో తరగతి ఆంగ్లంనకు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపి ఈ-పాఠశాల యాప్‌లో పొందుపరచడం జరిగిందని, ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణను సమర్థంగా వినియోగించుకుని చక్కని ఈ-కంటెంట్ రూపకల్పనకు కృషి చేస్తానని దొర మాస్టారు తెలిపారు. ఆయనను ద్వితీయ మండల విద్యా శాఖ అధికారి రమేష్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



శిక్షణకు ఎంపికైన దొర మాస్టారు

అనారోగ్యంతో సెక్యూరిటీ గార్డు మృతి

- కాన్సాయ్ నెరోలాక్ కంపెనీ వద్ద బంధువుల ఆందోళన
- కాంట్రాక్టరు, యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ





మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు, చెల్లూరి నూకరాజు (ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎస్ఈజెడ్ కాన్సాయ్ నెరోలాక్ పెయింటింగ్ పరిశ్రమలో సెక్యురిటీ గార్డు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన చెల్లూరి నూకరాజు(28) రాంబిల్లి మండలంలోని ఎస్ఈజెడ్ నెరోలాక్ పెయింటింగ్ కంపెనీలో కాంట్రాక్టు సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరయ్యాడు. కంపెనీ వద్ద కడుపు నొప్పి వస్తుంది.. అని కాంట్రాక్టర్‌కు తెలపగా అంబులెన్స్‌లో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నూకరాజు మృతి చెందాడు. కాగా నూకరాజు మృతికి కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టరు నిర్లక్ష్యమే కారణం అంటూ మృతుని బంధువులు మృతదేహంతో కంపెనీ వద్ద రాత్రి ఆందోళన చేశారు. నూకరాజు 24 గంటలు నొప్పి (అపెండిసైటిస్)తో చనిపోయినట్టు డాక్టర్లు రిపోర్ట్ ఇచ్చారు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వైద్యులు ఇచ్చిన రిపోర్టు

ఆస్పత్రిలో అరుదైన చికిత్స

- ఆరు కిలోల కణితి తొలగింపు



విలేకరులతో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది

చోడవరం రూరల్: గత కొన్నేళ్లుగా కడుపులో పెరుగుతున్న కణితి కారణంగా భరించలేని నొప్పితో అల్లాడుతున్న మహిళకు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించి బాధ నుంచి విముక్తి కలిగించారు. ఆమె కడుపులో నుంచి ఆరు కిలోగ్రాముల బరువైన కణితిని తొలగించారు. అది కూడా ఆరోగ్యశ్రీ పథకంలో చేయడం విశేషం. సంజీవని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ జనరల్, అనస్థసిస్ట్ ఆదారి చంద్రశేఖర్ సోమవారం విలేకరులకు ఈ అరుదైన శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలు తెలిపారు. చోడవరం సమీపంలోని చీడికాడ మండలం పెదగోగాడ గ్రామానికి చెందిన వి.దేముడు బాబు భార్య లక్ష్మి (47) గత కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమె భరించలేని నొప్పితో ఆస్పత్రిలో చేరడంతో ఆదివారం ప్రసూతి వైద్య నిపుణులు గొర్లె నిరుపమ, జనరల్ సర్జన్ ఎం.ఏసుప్రసాద్‌లు శస్త్రచికిత్స జరిపి ఆమె కడుపులో పెరిగి ఉన్న కణితి (ఒవేరియన్ సిస్ట్)ని విజయవంతంగా తొలగించారు.



తొలగించిన కణితి

ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి

కొంకోట : మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపులో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడిన కూలీ విశాఖ కేహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ అల్లు స్వామినాయుడు సోమవారం తెలిపారు. బుచ్చియ్యపేటకు చెందిన తిర్రి ప్రకాష్ (39) ట్రాక్టర్‌లో కూలీగా పని చేస్తున్నాడన్నారు. ఈ నెల 15న వినాయక ఉత్సవం సందర్భంగా ప్రకాష్, అదే గ్రామానికి చెందిన తిర్రి శ్రీనుల మధ్య మాట మాట పెరిగి గొడవ పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్‌పై నుంచి శ్రీను తోసివేయడంతో ప్రకాష్ వెన్నుకు దెబ్బ తగిలి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. దీంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. ఈ విషయమై భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. మృతుడికి కుమార్తె జ్యోత్స్న, కుమారుడు హేమంతకుమార్ ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన ప్రకాష్ మృతి వల్ల పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

త్రోబాల్ పోటీల్లో గునుపూడి విద్యార్థుల ఘనత

- త్రోబాల్ పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో తృతీయ స్థానం

నాతవరం : త్రోబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి గునుపూడి హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు తేవడం చాలా ఆనందంగా ఉందని గునుపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు టి. శివ జ్యోతి అన్నారు. మండలంలో గునుపూడి హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న లగుడు అరవింద్, 9వ తరగతి చదువుతున్న మత్తుర్తి భార్గవ్ ధనుష్ ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్నారు. వీరు జిల్లా స్థాయి త్రోబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. ఆయా విద్యార్థులను సోమవారం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు అభినందించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కారణంగా గునుపూడి హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పట్టణ ప్రాంత విద్యార్థులకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు సైతం అన్ని విధాలుగా రాణించగలరని తమ స్కూల్ విద్యార్థులు నిరూపించారన్నారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు నాయుడు, హైస్కూలు కమిటీ చైర్మన్ ఎస్.సత్యవతి, సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న గునుపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శివజ్యోతి

29 నుంచి పారా స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 29 నుంచి రైల్వే అక్వా స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ విడుదల చేశారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పలు జిల్లాలకు చెందిన పారా స్విమ్మర్లు ఈ పోటీల్లో పాల్గొనున్నారన్నారు. క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నాయి.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్‌లో మొత్తం 154 మందికి బదిలీలు చేశారు. వీరిలో 24 మంది ఎంపీడీవోలున్నారు. కార్యాలయ పరిపాలనా అధికారులు(ఏవోలు), సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, నాల్గో తరగతి ఉద్యోగులు ఉన్నారు. కొత్తగా వచ్చిన పది మందికి ఏజెన్సీలో పోస్టింగులు ఇచ్చారు.

మండలం	ఎంపీడీవోలు
అనందపురం	వి.జానకీ
భీమిలి	ఎస్.హనుమంతరావు
అచ్చుతాపురం	కె.ప్రభాకరరావు
బుచ్చియ్యపేట	వి.విజయలక్ష్మి
చీడికాడ	వి.హేమసుందరరావు.
చోడవరం	పి.వి.ఎస్.జె. ఆంజనేయులు
గొలుగొండ	ఎం.మేరీరోజ్
కె.కోటపాడు	ఎ.ఎ.సాంబశివరావు
మునగపాక	టి.వి.ఎస్.వి. ప్రసాదకుమార్
నక్కపల్లి	డి.సీతారామరాజు
నర్సీపట్నం	కె.ఉషశ్రీ
నాతవరం	పి.పార్థసారథి
పరవాడ	ఎస్.డి.శ్యాం సుందర్
రోలుగుంట	వి.ఎస్ నాగేశ్వరరావు
రాంబిల్లి	ఎస్.జయమాధవి
సబ్బవరం	పి.పద్మజ
ఎస్.రాయవరం	ఎస్.డేవిడ్‌రాజు
వి.మాడుగుల	జె.తేజరత్నం
హుకుంపేట	టి.రమదేవి
కొయ్యూరు	బి.రమేష్ నాయుడు
ముంచంగిపుట్టు	ఎం.శ్రీసాయి హర్ష
పాడేరు	పి.ఆశాజ్యోతి
పెదబయలు	కె.వి.ప్రసాద్

వలంటీర్ వ్యవస్థకు మంగళం

ప్రజా సేవకు వలంటీర్ వ్యవస్థను దూరం చేయడంతో 2014 నాటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సామాజిక పింఛన్లు మాత్రమే సవ్యంగా అందుతున్నాయి. మిగతా పనుల కోసం ప్రజలు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి పనికీ ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే నేరుగా ప్రభుత్వ సేవలందేవి. ఇప్పుడా పరిస్థితి లేదని వాపోతున్నారు.

- గత నెల 14వ తేదీతో ముగిసిన గడువు
- మోసం చేసిన చంద్రబాబు
- గౌరవ వేతనం రూ.10 వేలు పెంచుతామని బూటకపు హామీ
- అధికారంలోకి రాగానే వలంటీర్లను పక్కనపెట్టిన వైనం


జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు(ఫైల్)


వలంటీర్ సేవలు కొనసాగించాలని జోనల్ కార్యాలయం వద్ద ధర్నా(ఫైల్)


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)


కోట్నివీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి లేదు, ఉద్యోగం లేకుండా చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేసిన వలంటీర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఏర్పడింది. వలంటీర్ల వ్యవస్థ గడువు ముగిసినా కూటమి ప్రభుత్వం తీరుతో కొనసాగింపు ప్రశ్నార్థంగా మారింది. సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ అప్పగించడం ద్వారా ఇప్పటికే సర్కారు వారిని సేవలకు దూరం చేసింది. కులమత వర్గాల, రాజకీయలకు అతీతంగా పేదల చెంతకే ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 గృహాలకు, పట్టణ ప్రాంతాల్లో 75 నుంచి 100 గృహాలకు ఒక వలంటీర్ చొప్పున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించింది. పట్టణ, మండల పరిధిలో 510 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగావకాశం కలిగిందని ఆనందంతో సేవలు చేశారు. వలంటీర్‌కు నెలకు రూ.5 వేల వేతనంతో తమ పరిధిలోని కుటుంబాల వారికి సంక్షేమ పథకాలను చేరవేయడం, అవసరమైన సర్టిఫికెట్లు, విద్యుత్ బిల్లులు చెల్లింపు వంటి సేవలతోపాటు, కోవిడ్ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. ప్రభుత్వం ద్వారా కోవిడ్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే వలంటీర్‌కు నెలకు రూ.10 వేలు గౌవర వేతనం ఇస్తామని ఇచ్చి మాటకు ఎంతో ఆనందంతో వారంతా పట్టం కట్టారు.

మళ్లీ మొదలైన ప్రజలకు కష్టాలు...

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసిన వలంటీర్ వ్యవస్థకు వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక 2023లో చంద్రబాబునాయుడు బహిరంగంగా చౌకబారు విమర్శలు చేశారు. ఆ తర్వాత మాట మార్చి వలంటీర్ వ్యవస్థ చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని, కూటమి అధికారంలోకి వస్తే, రూ.5 వేలు నుంచి రూ.10 వేలు గౌరవ వేతనం పెంచుతామని చెప్పి మోసం చేశారు. ఇప్పుడు పింఛన్ల మినహా మిగతా పనుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వలంటీరే నేరుగా ఇంటికి వచ్చి చేసి పెట్టేవారు. ఇప్పుడు సచివాలయాలకు లేదా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామాల్లో చాలామంది నిరక్షరాసులు కావడం వల్ల ఇతరులపై ఆధారపడి, వారికి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఆందోళనలో వలంటీర్లు

వలంటీర్ వ్యవస్థ సేవలకు గత నెల 14వ తేదీతో గడువు ముగిసింది. ఆ తర్వాత ఈ వ్యవస్థ కొనసాగాలంటే, అందుకు కొత్తగా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఈ విషయమై తన వైఖరి కూటమి ప్రభుత్వం నేటికీ ప్రకటించలేదు. ఈ పరిస్థితిలో కొనసాగింపు కష్టమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరుతో తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ తమను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వలంటీర్‌గా కొనసాగించాలి



మాలాంటి నిరుద్యోగుల కుటుంబాలకు వలంటీర్ వ్యవస్థ ఎంతో కొంత ఆర్థికంగా ఆదుకునేది. సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్‌గా నేను రాజీనామా చేయలేదు. కూటమి ప్రభుత్వం వస్తే నెలకు రూ.10 వేలు ఇస్తామని ఎంతో ఆశ చూపారు. ఇప్పుడు పట్టించుకోలేదు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి మమ్మల్ని ఆదుకోవాలి.

– ఉషా, వలంటీర్, అనకాపల్లి

క్లుప్తంగా

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

కశింకోట: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కశింకోటలో ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు నాయకత్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ముఠా కార్మికులు, పంచాయతీ శానిటేషన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాల ప్రతినిధులు ఎం. నారాయణమ్మ, బి. సత్యవతి, గంప దొరబాబు, పి. అప్పారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


పార్కులో చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తుమ్మపాల: ఇంటి పరిసరాలతో పాటు ప్రజలు అధికంగా రాకపోకలు చేసే పార్కులు, మార్కెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గవరపాలెం పార్కు సెంటర్ వద్ద శ్రీగౌరీ పార్కులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల-(రేబాక) ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత అవగాహన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గిరిష్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ సీజ్

మునగపాక: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఎస్ఐ ప్రసాదరావు స్వాధీనం చేసుకున్నారు. చూచుకొండ సమీపంలో మట్టి తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో దాడి చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 470 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	5,160
రెండో రకం	3,450	4,280
మూడోరకం	3,000	3,400

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాటిజివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 423 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: మూడు కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలో రామాపురం గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన నీలగిరి హరీష్ తన బైక్‌పై మూడు కేజీలు గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. చిన్నిచిన్న ప్యాకెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేశామన్నారు.

ప్రతి వీధికి సీసీరోడ్డు నిర్మిస్తాం


సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

తుమ్మపాల: గ్రామంలో మట్టి రోడ్డు లేకుండా ప్రతి వీధికి సీసీ రోడ్డు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. మేజర్ పంచాయతీ తుమ్మపాలలో విద్యుత్ నగర్, మధురా నగర్‌లో రూ.22 లక్షల పంచాయతీ నిధులతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా మట్టి రోడ్డులోనే ప్రజల రాకపోకలు చేస్తున్నారని వాపోయారు. ఇళ్లలో వాడుక నీరు కూడా రోడ్లపై నుంచే పారుతుండటంతో ఇక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా విషయమై తమ దృష్టికి రావడంతో రోడ్డుకు నిధులు కేటాయించామన్నారు. శరవేగంగా పనులు పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కర్రి సన్యాశినాయుడు(బాబి), ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 15 శాతం వృద్ధి రేటుకు ప్రణాళికలు

రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి శశికళ



మాట్లాడుతున్న రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి శశికళ

అనకాపల్లి: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటు సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి ఎం.శశికళ తెలిపారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన జీవీఎంసీ, మండల పరిషత్, తదతర శాఖల మండల స్థాయి అధికారులతో ఆమె మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో పట్టణ, మండల స్థాయిలో విజన్ ప్లాన్‌పై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రగతి కోసం 15 రకాల రంగాలు ఉన్నట్లు తెలిపారు. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, మత్స్య, స్త్రీ శిశు సంక్షేమం, పరిశ్రమ, టూరిజం, సంక్షేమ వసతిగృహాలు, తాగునీరుతోపాటు ఇతర రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2023-24 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరానికి సాధించడానికి ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు ఒక పుస్తకం రూపంలో తయారు చేసి 2024-29 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్ ప్లాన్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఎంపీడీవో కె.వి.నరసింహరావు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సౌజన్య, మండల ఏపీడీపీవో శశికళ, ఎంఈవో-2 కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వేట నిషేధ భృతిని వెంటనే ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



అనకాపల్లి: జిల్లాలో చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన జీవనభృతిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట నిషేధించిన కాలానికి మత్స్యకారులకు భృతి చెల్లించకపోవడం అన్యాయమన్నారు. నిషేధ రోజుల్లోనే ఇవ్వాల్సి ఉండగా, గడువు ముగిసి మూడు మాసాలు అవుతున్నప్పటికీ జీవనభృతి చెల్లించకపోవడం చూస్తుంటే, వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. దాంతో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకొని కుటుంబ అసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే జీవనభృతి విడుదల చేయాలని కోరారు. సార్వత్రిక మత్స్యకారులకు జీవనభృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలు పెంచుతామన్న హామీ ప్రకారం వెంటనే అర్హులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

వరిలో అగ్గితెగులు సోకే అవకాశాలు

ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు


మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వరి పైరులో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోధుమ రంగు మచ్చతెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణ చర్యగా సిఫార్సు మేరకే ఎరువులు వేసుకోవాలన్నారు. గట్ల మీద కలుపును నివారించి తెగులు కనిపించినట్లయితే ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొడతెగులు కనిపించినట్లయితే హెక్సకోనజోల్ 2 మి.లీ. లేదో నేటివో(టెబుకొనజోల్+ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్) మందును 0.4 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని సూచించారు. వరిలో ఆకు ముడత పురుగు, కాండం తొలిచేపురుగు ఆశించవచ్చని, 2.5 మి.లీల క్లోరాంత్రనిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చన్నారు. 30 రోజుల నాటిన లేదు నేరుగా విత్తిన వరి పొలంలో కలుపు నివారణకు ఎకరానికి 8 గ్రాముల మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10 శాతం+క్లోరిమ్యురాన్ ఇథైల్ 10 శాతం(ఆల్మిక్స్)ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరుకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తి చేసే రసం పీల్చుపురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవాని, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కశింకోటకు స్కూలు గేమ్స్ చాంపియన్ షిప్

- బాలికల విభాగంలో కైవసం
- ముగిసిన మండల స్థాయి పోటీలు


స్కూల్ గేమ్స్‌లో బహుమతులు అందుకుంటున్న బాలికల హైస్కూలు క్రీడాకారులు


రన్నింగ్ పోటీలు


ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు


హైజంప్ చేస్తున్న బాలికలు

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్‌లో బాలికల విభాగంలో కశింకోట బాలికల హైస్కూలుకు చాంపియన్‌షిప్ లభించింది. ఎక్కువ ఆటల్లో స్కూలు బాలికలు ప్రతిభ చూపడంతో కైవసం చేసుకుంది. బాలురలో వెదురుపర్తి, కన్నూరుపాలెం హైస్కూళ్లు ప్రతిభ చూపాయి. కశింకోటలో మూడు రోజుల పాటు మండల స్థాయిలో నిర్వహించిన స్కూలు గేమ్స్ సోమవారం ఉత్సాహంగా ముగిశాయి. చివరి రోజు బాలబాలికలు అథ్లెటిక్స్ నిర్వహించారు. రన్నింగ్‌లో 100, 200, 400, 800, 1500 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వీటితోపాటు రెండు రోజులపాటు బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, యోగా, చదరంగం పోటీలు జరిగాయి. విజేత జట్లకు, అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, సభ్యులు పి. కల్యాణి, పీడీలు పెంటకోట కమల, వి. ప్రభాకరరావు, వీరునాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు.


కశింకోట బాలికల హైస్కూలుకు చెందిన విన్నర్స్, రన్నర్స్ జట్లు, క్రీడాకారులు

వెంకట దుర్గాప్రసాద్‌కు ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్



బాలుర విభాగంలో వెదురుపర్తి హైస్కూలు విద్యార్థి సోమిరెడ్డి వెంకట దుర్గాప్రసాద్ ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ సాధించాడు. వాలీబాల్, లాంగ్‌జంప్, రన్నింగ్, కబడ్డీ, షటిల్ పోటీల్లో ప్రతిభ చూపి చాంపియన్‌షిప్ పొందాడు. తొలిసారిగా ఇది లభించడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థి తెలిపాడు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ హెచ్ఎం జీ.వి.కె. ఆచారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం


విద్యనభ్యసిస్తున్న బధిర విద్యార్థులు

నక్కపల్లి: గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దాని ఆవశ్యకత గురించి విద్యార్థులకు ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయిని యాస్మిన్ వివరించారు. బధిరులు సాధారణ విద్యార్థులు మాదిరిగానే విద్య అభ్యసిస్తారన్నారు.

వినాయక ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


కోట్నివీధిలో వినాయకున్ని దర్శించుకున్న నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను యువత నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. గ్లాస్‌మెట్స్ వారి ఆధ్వర్యంలో స్థానిక కోట్నివీధిలో ఏర్పాటు చేసిన వినాయకున్ని సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులు తొలి పండగ వినాయక చవితితో ప్రారంభమై సంక్రాంతి వరకూ వివిధ దేవతల పండగలు జరుగుతాయని, యువత దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, వినాయక కమిటీ సభ్యులు బోని అభిరామ్, ఎల్.కామరాజు, ఆనంద్, సాయిరాం, నూకేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ కోరారు. మునగపాకలో మరిడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన గ్రామ పెద్దలతో కలిసి సోమవారం పరిశీలించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించే పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుతురులో ప్రతి ఒక్కరూ వీక్షించేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజేతలకు రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల వంతున బహుమతులు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ల ప్రోత్సాహంతో మునగపాక పంచాయతీ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పెద్దలు కర్రి సాయికృష్ణ, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట విజయ్, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీనివాసరావు(నెట్), వెలగా రామకృష్ణ, రాజాన బుజ్జి, కేపీ రావు, దాడి మురళి, ఆడారి లక్ష్మణరావు, పీలా శివ పాల్గొన్నారు.

పట్టణ ఎస్ఐగా ఈశ్వరరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: పట్టణ ఎస్ఐగా దాసరి ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌ల్లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడకు ఆయన వచ్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com